ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 27-32

# "శ్రీశ్రీ" కవిత్వ చమత్కారం - సంస్కారం

**డా,, టి.ఆశీర్వాదం**

ఆంధ్రోపన్యాసకులు

పి.ఆర్.ప్రభుత్వ కళాశాల (అ),కాకినాడ.

**స్థూల సంగ్రహం:** మార్పుకు మొరాయించిన వృద్ధ ప్రపంచానికి నెత్తురూ కన్నీళ్లు కలిపి కొత్త టానిక్ తయారు చేసిన శ్రీశ్రీ తన కవిత్వంలో బుద్ధిని వివేకాన్ని కళా నిబంధనల్ని మించిన ఏ అంతరాళానికో తాకే మహామానవ సంస్కారాన్ని, శబ్దాల్ని అధిగమించే చైతన్యంగా ప్రసరింపజేశాడు. హృదయం నుండి హృదయానికి ప్రసరించే హృదయభాష శ్రీశ్రీ కవిత్వంలో అంతర్ బహిర్ యుద్ధారావం చేసింది.

**కీలకపదాలు:** జోగిని, అంధవిశ్వాసాలు, నవలలు, వ్యవస్థ

శబ్ద చమత్కారాల పరిధి దాటి అర్థచమత్కారాల అవగాహన శ్రీశ్రీ కవిత్వంలో యుగచైతన్యమై ప్రవహించింది. ఈ క్రమంలో సాంప్రదాయక యజ్ఞోపవీతం, విప్లవగీతంగా అభివృద్ధి చెందింది. విరుద్ధాంశాలు వికాస దశలుగా మారిపోయాయి. "యముని మహిషపు లోహ మంటలు" మృత్యుభీతిని ముందుకు తెచ్చినా, "పుడమితల్లి పురిటి నొప్పులు", "కొత్త సృష్టి"ని సాధించి పునర్జన్మను పూరించాయి. చైతన్యానికి చావులేదని ఆత్మవిశ్వాసం ప్రకటించింది.

దుఃఖితలోకంలో శ్రీశ్రీ భవభూతి శ్లోకాల్ని ఉచ్చరిస్తూ కరుణను వీరం చేశారు. పీడిత ప్రపంచంలో కవిత్వం చైతన్యమైంది. తోసుకువస్తూన్న ప్రజాస్వామిక యుగానికి నవ్యకవిత్వ నిర్వచనం వికాస సంచలనమైంది.

ఫ్యూడల్ సమాజంలో నిస్త్రాణ ఎక్కువ – నిరాశ మక్కువ జీవితం శాపగ్రస్తం గానో లేక వరప్రసాదంగానో వ్యక్తి ప్రమేయం లేకుండా సాగిపోయే విధి విశేషం - ఈ కదలని భావజాలాన్ని కదలించడానికి శ్రీశ్రీ "పరిపూర్ణపు బ్రతుకు" ఆశయాన్ని కవిత్వంలో యుగకర్తవ్యంగా దట్టించాడు - బతుకును మున్ముందుకు తోసే విముక్తి గీతం ప్రపంచ పద్మవ్యూహంలో తీరని దాహమైంది- అది కుక్కపిల్ల దైన్యాన్ని అగ్గిపుల్ల తిరుగుబాటును యుగధర్మంగా నిర్వచించింది – సహస్రవృత్తుల సమస్త శక్తులూ 'తల్లిపేగును' పతాకంలో ధరించి విముక్తి యుద్ధం చేశాయి.

ప్రపంచ ద్వంద్వాలను, వైయుక్తిక జీవన సాఫల్య వైఫల్యాలను బొమ్మ కట్టిస్తూనే శ్రీశ్రీ విలువల్ని సమాజపరంగా బేరీజువేసి వర్గనైజం చాటారు. - అనితర సాధ్యమైన వర్గవిభజన చమత్కారంలో కవిత్వం మానవత్వం అయింది – మానవత్వం యుగ చైతన్యమయింది.

**"శిర్షిక"** సమస్యాపూరణం కావడం శ్రీశ్రీ కవిత్వ చమత్కారానికి పరాకాష్ఠ -పాద పూరణంలో ఒకే ఒక మాట "ఆః!" కవితామకుటంగా వైవిధ్యంతో తీర్పు చెప్పడం అద్భుతం..

నిప్పులు చిమ్ముకుంటూ
నింగికి నేనెగిరి పోతే
నిబిడాశ్చర్యంతో వీరు –

అని అర్థాంతరంగా వదిలేసిన అనివార్య అభివ్యక్తి. పాదపూరణమై పతాక సన్నివేశం అయింది. ఆ అపూర్ణ భావాన్ని సంపూర్ణం చేసే ప్రక్రియలో-రసావిష్కారమే కాదు కావ్యా విష్కారమూ జరిగింది- మానవ స్వభావమూ – మెరిసింది- వర్గనైజమూ విరిసింది- ఇంతటి సీరియల్ కవిత్వ చమత్కారం, నభూతో నభవిష్యతి-సామాన్యుడు అసామాన్యుడై ఎదిగిపోతే నిప్పులు పోసుకుంటుంది స్వార్థ

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 27-32

లోకం – నిబిడాశ్చర్యంతో నీల్గిన వృద్ధ ప్రపంచం దూసుకు పోయేతరాన్ని యుగాన్ని స్వాగతించలేని దుర్దశ -

వెత్తురు కక్కుకుంటూ
నేలకు నేరాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరే.., అః... అంటూ

కసిగా తీర్పు చెప్పారు – బోల్షివిక్ విప్లవంలో సామాన్యులు చరిత్ర సృష్టిస్తే పాలకులు నిబిడాశ్చర్యాన్ని ప్రకటించారు. 1917లో ప్రపంచగతి మారింది. మానవుడు. నిర్ణేత అయ్యాడు- శ్రమ జీవనం విలువ అయింది.

స్వార్థపరుల కుట్రల ఫలితంగా ప్రపంచ స్వప్నం ప్రతీఘాత, విప్లవంగా సోవియట్ రష్యా పతనమవుతే కసిదీరా శత్రు ప్రపంచం ఆశ్చర్యంతో సోషలిస్టు సమాజాన్ని తిరస్కరించింది. రెండు దశల్లోనూ ‘ఆః’ ఒక్కటే - అలాగే వైయక్తిక వికాసంతో ఒకడు శిఖరాలు అధిగమిస్తే ఆమోదం తెలుపని శత్రు పక్షం ఆశ్చర్యం- సాహస జైత్రయాత్రలో ఏ యోధుడైనా నింగికెగిసిన నైజంలో పట్టుదప్పి నేలకు రాలిపోతే తథాస్తు అన్నట్లుగా ఆఃశ్చర్యాన్ని ఆశీర్వాదంగా ప్రకటించింది. స్వార్థ కూటమి అసూయపర్వంలో.

ఉత్థానపతనాల్లో వ్యక్తమైన ‘ఆః’ అనే అభివ్యక్తి ఒకసారి ‘ఆశ్చర్యంగా’ వ్యతిరేకతను ధ్వనింపజేసి విజయాన్ని తిరస్కరించింది. తిరిగి అదే అభివ్యక్తి వైఫల్యాన్ని విషాదాన్ని ఆమోదిస్తూ ప్రతీకార విజయాన్ని ఉద్ఘోషించింది. బొమ్మబొరుసుల్లాంటి సన్నివేశంలో జీవితాన్ని సమాజాన్ని బొమ్మ కట్టించడంలో ఎన్నుకోబడిన శీర్షిక 'ఆః'! పంక్తి ముక్తాయింపు మాత్రమే కాదు. వర్గ విచారాన్ని చాటి చెప్పే కవిత్వ చ**మ**త్కారం.

మార్క్స్ మహర్షిగా శ్రీశ్రీని ఆవహించారు. లెనిన్ తపస్సు శ్రీశ్రీ అవగాహనను పెంచింది. స్టాలిన్ సేద్యం రాజీలేని పోరాటాన్ని నేర్పింది. కవితా కృషీవలుని కలల పంటలో “కవితా ఓ కవిత” మానవత్వ మమేకత్వానికి సంబోధన అయితే “దేశ చరిత్రలు” ప్రాపంచిక దృక్పథానికి దిగ్దర్శనాలయ్యాయి.

చరిత్ర చెప్పడం చరిత్రరాయని విజ్ఞత - చరిత్రను వ్యాఖ్యానించడం దార్శనికుని అంతఃకరణ - అది కవి సమయాన్ని వెలిగించే యుగ బాధ్యత – కాలం గుణపాఠాన్ని తీసే రాజనీతి.

రణ రంగం కాని చోటు
భూ స్థలమంతా వెదకిన దొరకదు
గతమంతా తడిసె రక్తమున
కాకుంటే కన్నీళ్ళుతో

ఒక బుద్ధుడు చెప్పాల్సిన మాటను శ్రీశ్రీ చెప్పాడు.- ఒక జీసెస్ ఉద్బోధించాల్సిన అంతఃకరణను శ్రీశ్రీ పలికించారు - ఒక చరిత్రకారుడు ఒక తత్వవేత్త ఒకటై తమని తాము పుటం పెట్టుకుని సాధించిన చరిత్ర తీర్పు ఇది, పరపీడన పరాయణత్వానికి కారణం తీసిన జ్ఞాన సిద్ధాంతం ఇది. శబ్ద విన్యాసాల్లో అర్థగౌరవాల్ని యుగపరిమితిని దాటించి చెప్పిన కవి సమయ సాక్షాత్కారం ఇది.

**శ్రీశ్రీ వ్యాఖ్యాత మాత్రమేకాదు**: యుగవివేకంతో మమేకం చెందిన బోధకుడు - అందిన చరిత్రలో అందని దృక్పథాన్ని సాధించిన కాలజ్ఞాని శ్రీశ్రీ.

పరస్పరం సంఘర్షించిన
శక్తులతో చరిత్రపుట్టెను –

ఈ మాటల ద్వారా శ్రీశ్రీ చరిత్ర గతుల్ని నిర్ధారించే పరిష్కర్త అయ్యాడు.

శ్రీశ్రీ కవిత్వ సన్నివేశాల్లో కొత్త కవి సమయం బుద్ధి చమత్కారంగా దూసుకువస్తుంది. జీవితం సమాజంగా విస్తరిస్తుంది.

శనిదేవత రథచక్రపు టిరుసులలో పడి నలిగిన దీనుల్ని హీనుల్ని ఉద్ధరించే ప్రవక్త రూపం మాత్రమే దాల్చలేదు. శ్రీశ్రీ కవి సమయం - “ఏడ్వకండి ఏడ్వకండి” అంటూ దగాపడిన తమ్ములతో సంఘటితమై “సాధుసత్వపు సోదరత్వపు సాధు సత్యం జయించాల” ని అక్షరయుద్ధం ప్రకటించింది సంఘీభావ సంస్కారం.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 27-32

ఈ లోకం మీదే నండి
మీ రాజ్యం మీరేలుకోండి

అంటూ ఎవరి హక్కును వారికి చూపాడు – ఎవరి యుగకర్తవ్యాన్ని వారు పూరించుకునేట్లు చేశాడు. పీడితులు తాడితులు అనాథలు అన్నార్థులంతా "దగాపడిన తమ్ముళ్లు" అని చాటాడు- ఒక క్రమ వికాస చైతన్యంగా శ్రీశ్రీ సంస్కారం మహాప్రస్థానం చేసింది. విముక్తిని సాధించింది.

"నిన్న వదలిన పోరాటం
నేడు అందుకొనక తప్పదు"

అని చెప్పడం. కమిట్‌మెంటును గుర్తు చేయడమే కాదు - విలువల పోరాటం నిరంతరతను, జాగరూకతను, నిర్మాణాన్ని సంఘటితత్వాన్ని ఏమరుపాటు లేకుండా అందుకోమని స్ఫూర్తినివ్వడం, ఒక చారిత్రక బాధ్యతను నిర్వర్తించడం - శ్రీశ్రీ కవి సమయాలన్నీ వేరువేరు అంశాల కింద వైవిధ్యంగా కనిపించినా అన్నీ ఒకే శీర్షికగా సమన్వయాన్ని సాధించి మానవ విప్లవమహాప్రస్థావాన్ని చేపట్టాయి. శ్రీశ్రీ వస్తు వైవిధ్యంలో లక్ష్యసాన్నిధ్యం కనబడుతుంది. - వైరుధ్యాల మధ్య వికాస పోరాటం ప్రజ్వరిల్లుతుంది.

దైనందిన సంఘటనల నుండి మానవీయమైన అంతఃకరణను వెలిగించడానికి కారుణ్యసన్నివేశంగా హాస్యాన్ని వ్యంగాన్ని అభివ్యక్తి మాధ్యమంగా తీర్చిదిద్దాడు. విజయవంతమైన బుద్ధివైశిత్య కళతో దైన్యాన్ని ధీశక్తిగా కరుణను కర్తవ్యంగా, హాస్యాన్ని శత్రువు దమననీతిగా మలచడంలో చార్లీ చాప్లిన్ కళను రాజకీయం చేశాడు-

దోపిడి పిడనను అణచివేతను ప్రతిఘటించే నిశ్శబ్ద బుద్ధికుశలత "ది గ్రేట్ డిక్టేటర్" . హిట్లరును నిద్రపోనీయలేదు. - మనిషిని యంత్రంగా మార్చే యాంత్రిక సంస్కృతిని అభివృద్ధి అనబడే దోపిడికి ఆధునీకరణను చాప్లిన్ "మాడర్న్ టైమ్స్" బండారంలో బయట పెట్టాడు. విషాదాన్ని హాస్యం చేసి విముక్తిని సాధించడం చాప్లిన్ అభినయ చమత్కారం - శ్రీశ్రీ దాన్ని పుణికి పుచ్చుకుని "విదూషకుడి ఆత్మహత్య"ను సాంఘిక "చతురస్రం" చేశాడు.

అగుపించనిదేదో ఒక
ఆత్మ పదార్థం కలదట
అన్నీ పోవచ్చు గాని
అది మాత్రం చావదట
ఇది శేష ప్రశ్నల సారం – హేతుతత్వం-
జన్మల కర్మలనీ
చాల దూరం వెళ్లిన
ఆలోచనలన్నీ ఈ
ఆత్మ చుట్టూ అల్లినవే

"విరక్తి ఒక్కటే ఈనాటి జీవితం మిగిల్చింద"ని చెబుతూ నిర్హేతుకతను నిలదీశాడు.- ఈ బుద్ధిగత ప్రాశ్నికతలో ఒక సునిశితమైన సత్యాన్వేషణ విజయం కనిపిస్తుంది. ఒక ప్రజాస్వామిక పరివ్రాజకుడు కింకర్తవ్యాన్ని బద్దలు కొడుతూ "సంఘం శరణం గచ్ఛామి"ని నిర్ధారిస్తాడు.

మాటలతో పరాచకాలాడిన శ్రీశ్రీ ఎప్పుడూ శబ్ద చమత్కారానికి బందీకాలేదు. చాటువుల సాంఘిక సంస్కారం, శతకాలు ఆత్మ బోధ శ్రీశ్రీ కి "సిప్రాలి" ని రాసేట్లు చేసింది.

ఈ ప్రకృతి గాఢరహస్య మెరుగలేక
చంచల మనస్కత బరిభ్రమించునాకు
విశ్వపథముల నడయాడి వేసరిలురు

శ్రీశ్రీని ఆత్మాశ్రయ ఘోషనుండి జనాశ్రయ భాషలోకి నెట్టింది. వందకందాలు రాయాలనే ఉత్కంఠ శ్రీశ్రీ కవిత్వ చమత్కారాన్ని స్థానికం చేసింది.

అందంగా మధురస, ని
ష్యందంగా పటిత్వ హృదయ సంస్పందంగా

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 27-32

నందాలోకనంద రచిం
చిందికి మనసయ్యె నాకు సిరిసిరిమువ్వ..

శ్రీశ్రీ ని సిరిసిరిమువ్వగా సరళం చేసిమకుటంగా మార్చుకొని ఆత్మబోధలో యుగచింతను చేశాడు.-

మళ్లీ ఇన్నాళ్లకి, ఇ
న్నేళ్లకి పద్యాలు రాయుటది ఎట్లన్నన్
పళ్లూడిన ముసలిది, కు
చ్చిళ్లు సవరించినట్టు సిరిసిరిమువ్వా!

వయసు మళ్లాక అందాల్ని అలరిస్తున్నందుకు తనపై తానే జోకు వేసుకుని కందాల వృద్ధాప్యాన్ని దాని అందచందాల అప్రాసంగికతను పరోక్షంగా ముందుకు తెచ్చాడు కవిత్వ చమత్కారంగా శ్రీశ్రీ -

ఏమైనా కొత్తవిరాశావా? అని చంపేవాళ్ల కోసం "జీవన్మృతి"గా కందాల్ని సిరిసిరి మువ్వలుగా పలికించాడు - కందాలు రాయడానికి పందిని చంపాల్సిన పనిలేదని షరతులు లేని అందాలే తన కందాలని పేర్కొన్నాడు.

శ్రీశ్రీ వ్యంగ్య చిత్రాల్లో వ్యాఖ్య పద్ధతి విరాట్ రూపం ధరిస్తుంది. తెలుగు ఇంగ్లీషులు కలిసిపోతాయి - జీవితం, సంఘం రాజకీయం కలగలిసి కావ్యాలవు తాయి – శబ్దం వ్యంగ్యమవుతుంది – వ్యంగ్యం వ్యాజ్య మవుతుంది - వ్యాజ్యం వ్యాఖ్య అవుతుంది, వ్యాఖ్య జీవిత సారమవుతుంది - జీవితం సామాజిక విశ్లేషణ అవుతుంది. సిప్రాలి అనగా సిరిసిరిమువ్వ పద్యాలు, ప్రాసక్రీడలు, లిమిరిక్కులు వగైరాలు ప్రత్యక్ష వ్యాఖ్యానం అవుతాయి. ఈ కవితా కార్టూన్లు ఫ్యూడల్ వికారాల్ని, పెట్టుబడి దారి దుర్మార్గాల్ని, ప్రజాస్వామ్యంగా చెలామణి అయ్యే ధరస్వామ్యాన్ని, మార్పు కడ్డంగా నిలిచే సాంప్రదాయాల్ని తూర్పారబడుతూ సోషలిస్టు సమాజాన్ని ఆకాంక్షిస్తాయి.

అవురా శ్రీరంగం శ్రీ
నివాసంరావూ బలీ మనిషివే, ఒక నీ
'కవితా వాద్యం' చాలిం
చివెళ్లి పొమ్మనకు నన్ను సిరి సిరి మువ్వా

"కవితా వాద్యం" అనే ప్రయోగం కవితా వ్యాసంగానికి బదులుగా వచ్చిన విశేషం. -ఛందోనియమాల్లో దూరిన శబ్ద ఘోష - మాటల గారడీలో శ్రీశ్రీ అర్థలీరుడు – ప్రమోజన పారీణుడు.

కుకవి నిందలేదు – సుకవుల స్తుతులు కనిపిస్తాయి. తెనాలి రామకృష్ణుని ధ్వని రాజ్యసార్వభౌమునిగా స్తుతించాడు చౌడప్పను కూచిమంచి జగ్గకవిని ఇష్టదేవతా ప్రార్థనలో చేర్చాడు.

**శ్రీశ్రీ కవిత్వ చమత్కారం** ఆధునిక సాహిత్యంతో మారుమోగిన పాత్రల్ని తలపడం కొత్త కవిసమయం.

ఎన్నాళ్లీ అస్వతంత్ర హీనస్థితి! ఇం
కేన్నాళ్లీ వైఫల్యం? – వాటి చెన్నపట్నం తెలుగువారి దుస్థితి.

ఈ తెలుగుపట్నం యదాస్థితిగా తోస్తుంది తన శతకానికి ఫలశ్రుతికూడా చెప్పాడు ఆధునిక రీతిలో శ్రీ శ్రీ.....

ఈ శతకం యెవరికైనా
చూసి చదివి వ్రాసిపాడి సోగసిన,సిగరెట్
వాసనలకు కొదవుండదు
శ్రీశ్రీ కరుణ బలిమివలన సిరిసిరిమువ్వా!

సాగసిన, శ్రీశ్రీ కరుణ అనే ప్రయోగాలు గమనార్హాలు .

శ్రీశ్రీ ఇంగ్లీషు ప్రాసక్రీడలు కందాల్లో అందాలైనాయి.- అందులో శరీర మాధ్యంఖలు ధర్మసాధనం దూరింది పరకాయ ప్రవేశంలా గోల్డ్ వ్యామోహం చెడ్డది.

మైల్డ్ వ్యాయామం శరీరమాద్యం ఖలుఇ చైల్డ్ వ్యాపారం కూడదు.
ఒల్డు వ్యాలను హెూల్డు చేయకుండుమురి జరూ-

దోచేసే వాళ్లను చూస్తూ వూరుకుంటే కంచె చేను మేసినట్లవుతుందని హెచ్చరించాడు. రామాయణాలు మళ్లీ మళ్ళీ రాయడంకన్నా "రామకోటి" రాయడం మేలన్నాడు - విశాఖ దోమల్ని పొగరెక్కిన 'రెక్కాను గులనడం" కొత్త పోలిక -

సిరిసిరి రావులం
చెల్లని పాపులం
మృత్యువు పరికిణీ
ఉతికే రేవులం
భగవంతుని ఊపిరితిత్తులం
ఊరవేసిన ఉపనిషత్తులం
అగుపించని రేపటికత్తులం
ఆదేశాల వలలం
ఆక్రోశాల కలలం

ఊరవేసిన ఉపనిషత్తుల్లో మృత్యువుతో పోరాటం లేని దేవునితో ఆరాటం కనిపించినా 'అక్రోశాల కలలు" కర్తవ్య బోధ చేస్తాయి...

రాస క్రీడలు శృంగారానికి
రమ్యమైన ప్రాణం
ప్రాస క్రీడలు హాస్యానికి
పసందైన బాణం -

పసందైన బాణంగా ప్రాసక్రీడను రాసాడు శ్రీశ్రీ.

గిట్టని సందర్భాల్లో రాజకీయాల పొలరైజేషీన్ లో సోమసుందరం ఆరుద్ర, దాశరథి, సినారేలని తూకం వేసి తూలనాధుడు చమత్కారంగా కృష్ణశాస్త్రి, విశ్వనాధ్ లు వ్యంగ్యం చిత్రాల్లో వాక్యాలయ్యారు శివశంకలు తేలాయి. పత్రికల్ని ప్రసారమాధ్యమాల్ని అమెరికాని పెట్టుబడిదారి సంస్కృతిని ఎండగట్టాడు..

జాతీయ భాష కాగ సిరి
సంస్కృతి కెప్పుడు?
మరణించిన కళేబరం
మాట్లాడేదెప్పుడు.

సాంఘిక రాజకీయ విషయాల్లో తూర్పార పట్టడానికకే సింప్రాలి సంధించాడు. రోజువారి జీవితంలో తటస్థపడే ముఖ్యాంశాల్ని జల్లెడ పట్టాడు.

ప్రజాస్వామ్య పార్టీల్లో
ప్రజలకు తానెప్పుడు?
నేతిబీరకాయలోన
వేయి పుట్టినప్పుడు -

ప్రజాస్వామ్య పక్షపాతిగా నిజమైన ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కోరుతూనే ప్రజాపక్షం వహించింది శ్రీశ్రీ కవిత్వ చమత్కారం.

ప్రపంచాన్ని చూడలేని

కవిత నిజం చూపదు
ఇసుకలోన తలదూర్చిన
ఉష్ట్ర పక్షి బాపతు -

ప్రాపంచిక దృక్పథం లేని కవితకు ప్రాసంగికత లేదని, అలా వచ్చేది ఉష్ట్ర పక్షి యదార్థ బీతి అని కావ్యమీమాంస.

విప్లవ సాహిత్యం

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 27-32

పోయే దారి కంటక భూయిష్ఠం దాని ప్రధాన రసం బీభత్సం
దాని పునాది సాంఘిక యదార్థం
దాని ఆదర్శం వర్గ రాహిత్యం

అభ్యుదయ యుగచక్రవర్తిగా యుగకర్తగా శ్రీశ్రీ విప్లవ సాహిత్యోద్యమ ప్రవక్తగా నిలిచాడు. అతని శబ్దం సందేశం - అతని భావం సంస్కారం అతని చమత్కారం – యుగ చైతన్యం – సింప్రాలి శ్రీశ్రీ అద్భుత వ్యంగ్య చిత్రం - శ్రీశ్రీ కవిత్వ చమత్కారం – సంస్కారం .

**ఆధార గ్రంథాలు:**

మహా ప్రస్థానం. శ్రీశ్రీ. - విశాలాంధ్ర ప్రచురణలు
ఖడ్గ సృష్టి శ్రీశ్రీ - విప్లవ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్
అనంతం శ్రీశ్రీ. - విరసం ప్రచురణ 1986 సాహిత్య సర్వస్వం
సాహిత్యంలో విప్లవం. శ్రీశ్రీ. - ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాదు.
తెలుగు సాహిత్య చరిత్ర. ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న